క్లుప్తంగా

పారిశుద్ధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ



పోతునూరులో పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు అందజేస్తున్న సర్పంచ్ స్వరూప్

దెందులూరు: పోతునూరులోని గ్రామ సచివాలయంలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు 15 మందికి శనివారం సంక్రాంతి పండుగ సందర్భంగా నూతన దుస్తులను సర్పంచ్ బోదుల స్వరూప్ అందజేశారు. పారిశుద్ధ్య సిబ్బందికి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. కరోనా సమయంలో పోతునూరు గ్రామ శివారు ప్రాంతాల్లో పారిశుద్ధ్య కార్మికులు విశేష సేవలందించారని సర్పంచ్ అభినందించారు.

పుట్టినరోజే జనన ధ్రువీకరణ పత్రం అందజేత



జనన ధ్రువీకరణ పత్రం అందిస్తున్న వైద్యసిబ్బంది

గణపవరం: గణపవరం పీహెచ్‌సీలో జన్మించిన బిడ్డకు అదేరోజున జనన ధ్రువీకరణ పత్రం జారీ చేసినట్లు పీహెచ్‌సీ వైద్యాధికారిణి కిరణ్మయి అన్నారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ పి.మౌనిక అనే మహిళ పీహెచ్‌సీలో గురువారం రాత్రి బిడ్డకు జన్మనిచ్చిందని, శుక్రవారం ఉదయం ఆమెకు బిడ్డ జనన ధ్రువీకరణ పత్రం ఇచ్చామని తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ జె.విల్సన్, సిబ్బంది పాల్గొన్నారు. శుక్రవారం డ్రైడే సందర్భంగా పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో శానిటేషన్ కార్యక్రమాలు నిర్వహించామన్నారు.

క్రికెట్ పోటీల్లో పవర్ లెవెన్ జట్టు విజేత




గోపన్నపాలెంలో విజేత జట్టుకు షీల్డ్‌ను అందజేస్తున్న దృశ్యం

దెందులూరు: యువత చెడు వ్యవసాలను దూరంగా ఉండాలని, విద్యతో పాటు ఆటల పోటీల్లో సత్తాచాటాలని తపన సంస్థ వ్యవస్థాపకులు గారపాటి చౌదరి అన్నారు. శుక్రవారం గోపన్నపాలెంలో తపనా పౌండేషన్ సహకారంతో అల్లూరి సీతారామరాజు క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోటీల్లో చివరి రోజు పవర్ లెవెన్ వర్సెస్ జర్సీ టీంల మధ్య జరిగింది. పోటీల్లో విజేత జట్టు పవర్ లెవెన్‌కి షీల్డ్, 20 వేలు అందజేశారు. రన్నర్ జట్టు జర్సీ టీంకు రూ.5వేలు, షీల్డ్‌ను సర్పంచ్ కోటే నాగమల్లేశ్వరీ కుమార్ అందజేశారు. నిర్వాహకులు ఉల్లింగిల చందు అతిథులకు, క్రీడాకారులకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రతి ఇంట్లో భోగభాగ్యాలు వెల్లివిరియాలి



కోటగిరి శ్రీధర్, ఏలూరు ఎంపీ



కొఠారు అబ్బయ్యచౌదరి, ఎమ్మెల్యే

దెందులూరు: ప్రతి ఇంట్లో భోగభాగ్యాలు వెల్లివిరియాలని ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఆకాంక్షించారు. శనివారం ఏలూరు ఎంపీ, ఎమ్మెల్యే కార్యాలయంలో వారు ఓ ప్రకటన విడుదల చేశారు. రైతులతో పాటు ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలు, భోగభాగ్యాలు, చిరునవ్వులతో సంతోషంగా భోగి, సంక్రాంతి, కనుమ పండుగలను జరుపుకోవాలని అన్నారు. ప్రజలందరికీ భోగి, సంక్రాంతి పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

157 బైండోవర్ కేసుల నమోదు



పోణంగిలో టెంట్ పీకేయించిన తహసీల్దార్ సోమశేఖర్

ఏలూరు రూరల్: సంక్రాంతిని పురస్కరించుకుని కోడి పందేలు, జూదం నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ బి.సోమశేఖర్ హెచ్చరించారు. శుక్రవారం పోణంగిలో కోడి పందేల నిర్వహణకు ఏర్పాటుచేసిన టెంట్లను ఆయన సిబ్బందితో తొలగింపజేశారు. స్థానిక సచివాలయం వద్ద ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఇప్పటి వరకు 157 బైండోవర్ కేసులు నమోదు చేశామని, 21 మందికి నోటీసులు జారీ చేశామని తెలిపారు. కోర్టు ఆదేశాల దిక్కరించే వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు.

అంగరంగ వైభవంగా సంక్రాంతి సంబరాలు



గణపవరంలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు



గుండుగొలనులో రంగవల్లులు వేస్తున్న మహిళలు



రంగవల్లులను పరిశీలిస్తున్న ఉపసర్పంచ్ ముదుండి సూర్యనారాయణరాజు



గంగన్నగూడెం హైస్కూల్లో భోగిమంట వద్ద పాఠశాల విద్యార్థులు

గణపవరం: స్థానిక పంచాయతీ ఆవరణలో శుక్రవారం నిర్వహించిన సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటాయి. బొగిమంటలు, హరిదాసులు, రంగవల్లులతో ఆ ప్రాంతం కోలాహలంగా మారింది. ఈ సందర్భంగా నిర్వహించిన ముగ్గుల పోటీలలో పెద్దసంఖ్యలో మహిళలు పాల్గొని రంగవల్లులను తీర్చి దిద్దారు. ముగ్గురిని ఎంపిక చేసి ప్రథమ బహుమతిగా రూ.10 వేల పట్టుచీరను గణపవరం ఎంపీపీ అర్ధవరం రాము బహూకరించారు. రెండో బహుమతిగా రూ.8వే ల విలువైన పట్టుచీరను వైఎస్సార్ సీపీ నాయకుడు కాకర్ల శ్రీను, మూడో బహుమతి రూ.6 వేల విలువైన మిక్సీ, గ్రైండర్‌ను మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ దండు రాము బహూకరించారు. నాలుగో బహుమతిగా రూ.6 వేల విలువైన గ్యాస్‌పొయ్యిని సర్పంచ్ మూర అలంకారం, ఐదో బహుమతిగా రూ.3 వేల విలువైన చీరను రాష్ట్ర సూర్యబలిజ కార్పొరేషన్ చైర్మన్ శెట్టి అనంతలక్ష్మి, ఆరో బహుమతిగా రూ.3వేల విలువైన చీరను ఎంపీడీఓ జ్యోతిర్మయి విజేతలకు బహుకరించారు. పోటీల్లో పాల్గొన్న వారందరికీ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మండల అధ్యక్షుడు అర్ధవరం రాము మాట్లాడుతూ సంక్రాంతి పండుగ తెలుగువారికి ఎంతో ఇష్టమైన పండుగ అని, పండుగ ఆచారాలు చాలావరకూ కనుమరుగైపోతున్నాయని, వాటిని భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ ఉపాధ్యక్షుడు గాదిరాజు అబ్బాస్, గణపవరం సీఐ ఎంవీ సుభాష్, ఎస్సై వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు తోట శ్రీను, దేగల కొండయ్య, కొండేటి వెంకటరత్నం, అడపా త్రినాథ్, మూర భాస్కరరావు, ఖాదర్‌ఖాన్, పంచాయతీ కార్యదర్శి డీఎస్ఆర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా రంగవల్లుల పోటీలు

భీమడోలు: గుండుగొలనులో సంక్రాంతి వేడుకలు ఘనంగా ముగిసాయి. గ్రామంలోని ఉపసర్పంచ్ ముదుండి సూర్యనారాయణరాజు ఆధ్వర్యంలో రెండో రోజైన శుక్రవారం నిర్వహించిన ముగ్గుల పోటీల్లో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని సంక్రాంతిని ప్రతిబింబించే ముగ్గులు వేసి చూపరులను ఆకట్టుకున్నారు. రంగవల్లులపై గొబ్బెమ్మలను ఉంచారు. దీంతో ఆ ప్రాంతమంతా ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంది. అనంతరం విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు గొటికల మురళీ, నల్ల శంకర్, వైసీపీ నేతలు నల్ల శ్రీను, జహీర్ తదితరులు పాల్గొన్నారు.

భోగిమంటకు ఏర్పాట్లు

దెందులూరు: భోగి పండుగను ఘనంగా నిర్వహించేందుకు గ్రామాల్లో ఏర్పాట్లు పూర్తయ్యాయి. దెందులూరు 9వ వార్డు నాలుగురోడ్ల కూడలిలో బీఆర్‌డీ నర్సింగ్ కళాశాల కరస్పాండెంట్ సుగ్గిశెట్టి నూకరాజు, డైరెక్టర్ సుగ్గిశెట్టి సత్యనారాయణ ఆధ్వర్యంలో సంస్కృతి సంప్రదాయాలు ప్రతిబింబించేలా భోగిమంటలు వేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. రోడ్డుపై దిమ్మను నిర్మించి కలప పేర్చారు. దిమ్మకు రంగులు వేసి అందంగా తీర్చిదిద్దారు. పురాతన వంటసామగ్రి, సంప్రదాయ పిండివంటల ప్రదర్శన స్టాల్స్ ఏర్పాటు చేశారు. బొమ్మల కొలువు, భోగిపండ్లు పోయడం, పొంగలి వండటం, హరిదాసు, గంగిరెద్దుల సంప్రదాయ నృత్యాలు శనివారం తెల్లవారుజామున ఉదయం 4 గంటల నుంచి భోగి మంట ప్రారంభమవుతుందని నూకరాజు అన్నారు. భోగి పండుగ సందర్భంగా సంప్రదాయ దుస్తులు ధరించిన వారికి బహుమతి ఇస్తామని వివరించారు.

పాఠశాలల్లో సంక్రాంతి సంబరాలు

దెందులూరు: గంగన్నగూడెం ఉన్నత పాఠశాలలో శుక్రవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. 8,9,10 తరగతి విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో పాఠశాల ప్రాంగణమంతా సందడి చేశారు. భోగిమంటలు వేసి, రంగులతో రంగవల్లులు తీర్చిద్దారు. చిన్నారులు సంప్రదాయ దుస్తులు ధరించి నృత్యాలు చేస్తూ సందడి చేశారు. ఉపాధ్యాయులు బోయపాటి వెంకటేశ్వరరావు, లక్ష్మి, సాయిబాబు, సహచర ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు.

పొద్దుతిరుగుడు సాగు వైపు రైతుల మొగ్గు



విజయరాయి వద్ద పొలంలో సాగవుతున్న పొద్దుతిరుగుడు

పెదవేగి : పొద్దు తిరుగుడు వైపు రైతులు మొగ్గు చూపుతున్నారు. మండలంలోని సూర్యారావుపేట, గార్లమడుగు, పెదవేగి, విజయరాయి, రాయన్నపాలెంలో అధికంగా ఈ పొద్దు తిరుగుడు సాగు చేస్తున్నారని ఉద్యానశాఖ అధికారులు తెలిపారు. మండల వ్యాప్తంగా 120 ఎకరాల వరకు పంట సాగు చేస్తున్నారని, యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులతోపాటు లాభాలు ఆర్జించవచ్చని మండల వ్యవసాయశాఖాధికారి ఎం ప్రియాంక చెప్పారు. పొద్దుతిరుగుడు పంట మంచి ఫలితాలిస్తుందని, గతంలో సాగు చేసిన రైతులు చెబుతున్నారు.

జేఎన్‌టీయూకే జట్టు విజయంపై హర్షం

దెందులూరు: సౌత్ జోన్ (6 రాష్ట్రాలు) స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు జేఎన్‌టీయూ కాకినాడలో నిర్వహించారు. ఈ పోటీల్లో జేఎన్‌టీయూ కాకినాడ ద్వితీయ స్థానం సాధించడంపై సౌత్ జోన్ క్రీడల మేనేజర్, వేగవరం హేలాపురి ఇంజనీరింగ్ కళాశాల ఏఓ కరుణానిధి, హ్యాండ్‌బాల్ జిల్లా కోచ్ శ్రీనివాసరావు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం కళాశాలలో కరుణానిధి, శ్రీనివాసరావు మాట్లాడుతూ జేఎన్‌టీయూ టీంలో వేగవరం ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన ముగ్గురు ఇంజనీరింగ్ విద్యార్థులు ఉన్నారని సంతోషం వ్యక్తం చేశారు. ద్వితీయ స్థానం సాధించి అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన జేఎన్‌టీయూకే టీంకు అభినందనలు తెలిపారు.

కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు



గ్రామ కమిటీ సభ్యుల సమావేశంలో మాట్లాడుతున్న సీఐ సుభాష్



కొవ్వలి నీలయ్య సెంటర్ వద్ద ఫ్లెక్సీలతో అవగాహన కల్పిస్తున్న వీఆర్వోలు

గణపవరం: సంక్రాంతి సందర్భంగా కోడి పందేలు జూదాలకు ఎలాంటి అనుమతులూ లేవని, సర్కిల్ పరిధిలో మూడు మండలంలో ఎక్కడా కోడి పందేలు, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తీవ్రంగా ఉంటాయని గణపవరం సీఐ ఎంవీ సుభాష్ అన్నారు. శుక్రవారం గణపవరం మండలం పిప్పర పంచాయతీ కార్యాలయం వద్ద కోడి పందేలు వంటి చట్టవ్యతిరేక కార్యక్రమాలను నిర్వహించకుండా గ్రామ నిఘా బృందాల సభ్యులు, వీఆర్‌వోలు, పంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రముఖులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సుభాష్ మాట్లాడుతూ జూదాలు అరికట్టడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని అన్నారు. కోడి పందేలు, పేకాటలు, ఇతర అసాంఘిక కార్యక్రమాలు జరుగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామన్నారు. పోలీస్ సిబ్బంది, కాక్‌ఫైట్ నిరోధక బృందాలతో పాటు వీఆర్‌వోలు, గ్రామపంచాయతీ కార్యదర్శులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. గణపవరం ఎస్సై వేముల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మండలంలో ఎక్కడా కోడి పందేలు జరుగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నామని, ఎక్కడైనా బరులు ఏర్పాటు చేస్తే కేసులు నమోదు చేయడంతో పాటు బరులు ధ్వంసం చేస్తామని హెచ్చరించారు. ఇప్పటికే కోడికత్తులు తయారీ దారులను అదుపులోకి తీసుకుని, కోడి కత్తులు స్వాధీనం చేసుకుంటున్నామని, ఎక్కడైనా బరులు ఏర్పాటుచేస్తే సంబంధిత స్థలం యజమానులపై కూడా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాకర శ్యాంసన్, ఐఎస్ఎన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

కోడిపందేలు, పేకాట నివారణపై ప్రచారం

దెందులూరు: సంక్రాంతి పండుగ సందర్భంగా మండలంలో హైకోర్టు ఆదేశాల మేరకు కోడిపందేలు, పేకాట, గుండాట నిర్వహించరాదని దెందులూరు తహసీల్దార్ ఎన్‌వీ నాంచారయ్య, ఎస్సై ఐ. వీర్రాజు అన్నారు. శుక్రవారం దెందులూరు, కొవ్వలి, పోతునూరు అన్ని గ్రామాల్లో ప్రభుత్వ కార్యాలయాల వద్ద, బహిరంగ కూడళ్ల వద్ద, విద్యా సంస్థల వద్ద ఫ్లెక్సీలను పోలీసులు, రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఫ్లెక్సీలతో ర్యాలీ, సమావేశాలు నిర్వహించారు. చట్టాన్ని అతిక్రమిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

విక్రయానికి పందెం కోళ్లు సిద్ధం



కోడిపుంజులు

పెదవేగి : సంక్రాంతి సంబరాలకు కొంచెం ముందుగానే కోడిపుంజులు సిద్ధమయ్యాయి. పండుగ మూడు రోజులు గ్రామీణులు కోడి పందేలకు అధిక ప్రాధాన్యం ఇస్తారు. ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా భారీగా బరులు ఏర్పాటుకు వివిధ గ్రామాల వారు సిద్ధమవుతున్నారు. పందేలను అడ్డుకుంటామని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. గతేడాది నియోజకవర్గంలో కొప్పాక, బి శింగవరం, బాపిరాజుగూడెం, రాయన్నపాలెం, వేగివాడ, రామశింగవరం, కొప్పాకగూడెం, జానంపేట, పినకడిమి, బోగాపురం, కొప్పులవారిగూడెం, రామారావుగూడెం, దెందులూరు, జోగన్నపాలెం, పెదపాడు, వసంతవాడ, వట్లూరు తదితర గ్రామాల్లో భారీ ఎత్తున కోడిపందేలు నిర్వహించారు. పోలీసులు, అధికారుల నిఘా ఎక్కువకావడంతో ఈ ఏడాది పందేల నిర్వహణకు అనువైన ప్రాంతాలను బరుల నిర్వాహకులు అన్వేషిస్తున్నారు. పందెం కోడిపుంజు ధర రూ.5 వేల నుంచి రూ.25వేల వరకు విక్రయిస్తున్నారు. సైజును రకాన్ని బట్టి కొన్ని పుంజుల రేటు రూ.40 వేల వరకు పలుకుతోంది. పందెం కోళ్లను రైతులు పొలాల్లో, వివిధ రకాల రహస్య ప్రదేశాల్లో బలమైన ఆహారం పెడుతూ సంక్రాంతి పందేలకు సిద్ధం చేస్తున్నారు.

కోడి పందేలు నిబంధనలకు విరుద్ధం

నిబంధనలకు విరుద్ధంగా కోడిపందేలు నిర్వహిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని పెదవేగి ఎస్సై ఎం.లక్ష్మణ్ అన్నారు. అందుకోసం సంక్రాంతి కొద్ది రోజుల ముందు నుంచే జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అనుమానాస్పద వ్యక్తులను ముందస్తు చర్యగా బైండోవర్ చేశామని ఆయన తెలిపారు.

హైటెక్ హరిదాసులు..ఆదరణకు నోచుకోని బసవన్నలు



మోటార్‌సైకిల్‌పై మైక్‌లో పాటలువేస్తూ తిరుగుతున్న హరిదాసు



సంక్రాంతికి ముస్తాబై ముంగిళ్లకు బయలుదేరిన బసవన్న

గణపవరం: గతంలోలా హరిదాసులు గ్రామాలలో కాలినడకన ప్రతి గుమ్మానికి తిరిగే ఓపికలేక మోటార్ సైకిళ్లను ఆశ్రయించారు. మోటార్‌సైకిల్‌పై ఘటాన్ని అమర్చి, ఒకమైకుసెట్టును ఏర్పాటు చేసుకుని మైక్‌సెట్‌లో పాటలువేసుకుంటూ గ్రామాలలో తిరుగుతున్నారు. అదికూడా ఇంటింటికి వెళ్లే పరిస్థితి లేదు. ఒక్కోకూడలిలో కొంతసేపు హరిదాసు కీర్తనలు వినిపిస్తూ ఉంటూ ఆ చుట్టుపక్కల వారు బియ్యం కూరగాయలు వంటివి సమర్పించుకుంటున్నారు. ఇలా రోజూ రెండు మూడు గ్రామాల్లో హరిదాసులు మోటార్ సైకిళ్లపై తిరుగుతూ సంక్రాంతి సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు. మరి కొన్నాళ్లకు హరిదాసులు కనుమరుగయ్యే పరిస్థితులు ఉన్నాయని, కథల్లోనూ, సినిమాలలోనూ తప్ప హరిదాసులు బయటకనిపించే పరిస్థితులు ఉండవని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గ్రామంలో హరిదాసుగా వచ్చిన శివయ్య సాక్షితో మాట్లాడుతూ 'మాది కృష్ణాజిల్లా, నాకు ఊహ తెలిసినప్పటి నుంచి సంక్రాంతి రోజులలో ఈ ప్రాంతంలో హరిదాసుగా వస్తున్నాను. నెల రోజుల పాటు ఒక్కడినే ఒక ఇల్లు తీసుకుని చుట్టు పక్కల గ్రామాలలో తిరిగే వాడిని. సంక్రాంతి తర్వాత ఇంటింటికివ వెళ్లి వారిచ్చే బియ్యం కానుకలు తీసుకువెళ్లేవాడిని . గతంలో మాదిరిగా ఇప్పుడు హరిదాసులకు ఆదరణలేదు. మాకు కూడా తిరిగే ఓపికతగ్గిపోయింది. దీనితో మోటార్ సైకిళ్లపై తిరుగుతున్నాం. మా సంతానానికి హరిసేవపై ఆసక్తి లేదు. మాతరంతోనే హరిదాసులు చాలా వరకూ కనుమరుగయ్యేలా ఉన్నారు' అని ఆవేదన వ్యక్తం చేశారు.

ఆదరణలేని డూడూబసవన్నలు

సంక్రాంతి సీజన్‌లో కనిపించే గంగిరెద్దులుకూడా నిరాదరణకు గురవుతున్నాయి. సన్నాయిమేళాలతో ఓరాముడూ.. అమ్మగారికి దండంపెట్టు... అయ్యగారికి దండంపెట్టు... అంటూ ఇంటి ముంగిట గొబ్బెమ్మల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ బసవన్నలను ఆడిస్తూ సంక్రాంతికి కొత్తశోభను తెచ్చే గంగిరెద్దులదీ అదే పరిస్థితి. సంక్రాంతి వచ్చిందంటే గజ్జెలు కట్టి రంగురంగుల వస్త్రాలు, పూలతో బసవన్నలను అలంకరించి, సన్నాయి మేళాలతో ఊరూరా తిరిగే గంగిరెద్దువారికి ఆదరణ లేక వారి వృత్తికి దూరమవుతున్నారు. సంప్రదాయంగా వస్తున్న కళను వదలలేక కొందరు మాత్రం సంక్రాంతి సీజన్‌లో గంగిరెద్దులను ఆడిస్తూ తమ వృత్తిని కొనసాగిస్తున్నారు.ఏలూరు సమీపంలోని కొత్తూరు నుంచి గణపవరం పరిసర గ్రామాలకు వచ్చిన కొందరిని కలిస్తే తమ బాధలు వివరించారు. గంగిరెద్దు పోషణకు అధికంగా ఖర్చు అవుతుందని, సంక్రాంతి అలంకరణకే సుమారు పదివేలు ఖర్చు చేస్తామని, రెండు నెలలపాటు గ్రామాల్లో తిరిగితే ప్రజలు ఇచ్చే దానధర్మాలతో ఏడాదిపొడవునా జీవనం వెళ్లదీస్తామని చెప్పారు. వృతి భారమైన తరతరాలుగా వస్తున్న ఆచారాన్ని వదల్లేక కొనసాగిస్తున్నామని రామయ్య అనే వ్యక్తి ఆవేదన వ్యక్తం చేశారు.

ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థుల సందడి



పూళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1986-87 బ్యాచ్ విద్యార్థులు

భీమడోలు: పూళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1986–87 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన వేడుక శుక్రవారం ఘనంగా నిర్వహించారు. టెన్త్ బ్యాచ్‌కు 110 మంది విద్యార్థులంతా తమ కుటుంబ సమేతంగా వచ్చి పాత జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు పాదాభివందనం చేసి దీవెనలందుకున్నారు. ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు, సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో ఉద్యోగులు స్థిరపడిన వారంతా ఇక్కడకు చేరుకుని తమ గురువులను అభినందనలతో ముంచెత్తారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులు టి.సూర్యనారాయణ, డి.సూర్యనారాయణ, జి.రాధకృష్ణ, సీతారాం, విజయలక్ష్మీ, వర్ధినేడి లక్ష్మణరావులను మెమెంటోలను అందించి ఘనంగా సత్కరిచారు. తొలుత మృతి చెందిన విద్యా ర్థులు, టీచర్లను స్మరించుకుంటూ కొద్ది నిమిషాల పాటు మౌనం పాటించారు. అనంతరం వారంతా సహపంక్తి భోజనాలు చేశారు. నిర్వాహకులు పులఖండం గణేష్, కొప్పుల కిషోర్, పులిచర్ల పూర్ణచంద్రరావు, కోలా సారధి పాల్గొన్నారు.

విజయవంతంగా సంక్రాంతి క్రీడోత్సవాలు

ఏలూరు టౌన్: సంక్రాంతి వేడుకలను ప్రజలంతా సంతోషంగా నిర్వహించుకోవాలని, యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా సంప్రదాయాలకు విలువ ఇవ్వాలని ఏలూరు ఇన్‌చార్జి డీఎస్పీ జీవీఎస్ పైడేశ్వరరావు అన్నారు. ఏలూరు జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ ఆదేశాలతో ఏలూరు సబ్‌డివిజన్ పరిధిలో ఏలూరు కోటదిబ్బ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో సంక్రాంతి క్రీడోత్సవాలు నిర్వహించారు. క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతలుగా నిలిచిన జట్టులకు బహుమతులు ప్రదానం చేశారు. డీఎస్పీ పైడేశ్వరరావు, తహసీల్దార్ సోమవేఖర్, వన్‌టౌన్ సీఐ బోనం ఆదిప్రసాద్, ఎస్సైలు లక్ష్మీబాబు, రామకృష్ణ విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ పోటీల్లో 15వ డివిజన్ జట్టు విజేతగా నిలవగా, 16వ డివిజన్ జట్టు రన్నర్స్‌గా నిలిచారు.

తెలుగు ప్రజల ప్రియమైన పండుగ సంక్రాంతి

ఏలూరు (టూటౌన్): తెలుగు ప్రజల ప్రియమైన పండుగ సంక్రాంతి అని సీఐటీయూ నాయకులు పి.కిషోర్ అన్నారు. తిప్పాని లక్ష్మీకాంతం స్మారక ట్రస్టు ఆధ్వర్యంలో డీవైఎఫ్ఐ సంక్రాంతి ఆటల పోటీల్లో భాగంగా స్థానిక తూర్పువీధి, కుస్తీలు దొడ్డి ప్రాంతంలో ముగ్గులు పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కిషోర్ మాట్లాడుతూ ఏలూరులో గత 30 ఏళ్ల నుంచి డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో సంక్రాంతి ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు, యువతను తప్పు దోవ పట్టిస్తున్న గంజాయి వంటి మత్తు పదార్థాలను అరికట్టాలని అన్నారు. వ్యవసాయ పంటలు చేతికి అందిన నేపథ్యంలో పుట్టుకొచ్చిన పండుగ సంక్రాంతి అని వివరించారు. ఐద్వా జిల్లా కన్వీనర్ పి.హైమావతి మాట్లాడుతూ మహిళలపై అకృత్యాలను అరికట్టాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్, బాల సంఘం నిర్వాహకులు సీహెచ్ ఆంతోని, స్థానిక పెద్దలు ఇ.శాంతారావు తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ అసిస్టెంట్లకు స్థానచలనాలు



డీఎంహెచ్ఓ నాగేశ్వరరావును సత్కరిస్తున్న కాంట్రాక్ట్ హెల్త్ అసిస్టెంట్లు

ఏలూరు టౌన్: అనేక ఏళ్లుగా ఒకే చోట ఉద్యోగం చేస్తూ బదిలీ అవకాశాలు లేక అవస్థలు పడుతోన్న వైద్య ఆరోగ్యశాఖలోని కాంట్రాక్ట్ హెల్త్ అసిస్టెంట్లకు ఎట్టకేలకు స్థాన చలనాలు లభించాయి. ఆ వివరాలను ఏపీ కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ జీవీవీ ప్రసాద్ వెల్లడించారు. వైద్య ఆరోగ్య శాఖలో కొత్తగా వచ్చిన వైఎస్సార్ హెల్త్ క్లీనిక్స్‌కు కాంట్రాక్ట్ హెల్త్ అసిస్టెంట్లను సర్దుబాటు చేస్తూ ఇటీవల జారీ చేసిన ఉత్తర్వులతో సమస్యకు పరిష్కారం లభించిందన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగులు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగేశ్వరరావును సత్కరించారు. ఆయన చొరవతో కౌన్సిలింగ్ ప్రక్రియ ప్రారంభమైందన్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 20 ఏళ్లుగా బదిలీలకు నోచుకోని ఉద్యోగులకు మేలు జరిగిందని తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వులతో 410 మంది ప్లెయిన్ ఏరియా వారికి, 25 మంది ఏజెన్సీ ప్రాంతాల వారికీ స్థాన చలనం జరిగే అవకాశం వచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో ఏపీ ప్రజారోగ్య వైద్య ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు నల్లా అప్పారావు ఉన్నారు.